వారం రోజుల్లో 'డబుల్' ఇళ్లలోకి వెళ్లకపోతే రద్దు చేస్తాం

- 968 మంది లబ్ధిదారులకు నోటీసులు

కవాడిగూడ, మే 2 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి వెళ్లకపోతే లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లను రద్దు చేస్తామని ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముషీరాబాద్ మండల పరిధిలో సికింద్రాబాద్, సనత్‌నగర్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు చెందిన 968 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించగా తాళాలు వేశారని, ఇళ్లల్లోకి ఎవరూ వెళ్లడం లేదన్నారు. సికింద్రాబాద్ ఆర్డీవో ఆదేశాల మేరకు వారికి నోటీసులు జారీ చేస్తున్నామని, వారం రోజుల్లో లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లాలన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం కింద ఆన్‌లైన్‌లో 9,006, మాన్యువల్‌గా ఐదువేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మాన్యువల్‌గా వచ్చిన దరఖాస్తులను కులాల వారీగా విభజించి బ్యాంక్ అధికారులకు పంపిస్తామన్నారు. మ్యాన్‌వల్ దరఖాస్తు పత్రాలను అందజేయని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న స్లిప్‌తో పాటు అన్ని పత్రాలను ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని రాణాప్రతాప్‌సింగ్ సూచించారు.


డాక్టర్ నీలా శ్రీధర్‌కు దాసరి ప్రతిభా అవార్డును ప్రదానం చేస్తున్న సుమన్, మురళీమోహన్, అనిల్ రావిపూడి తదితరులు

డాక్టర్ నీలా శ్రీధర్‌కు దాసరి ప్రతిభా అవార్డు ప్రదానం

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): దాసరి ఫిల్మ్ అవార్డ్స్ - 2025 ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో శుక్రవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడు, వాసవీ ఆర్ట్ థియేటర్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్‌కు దాసరి ప్రతిభా అవార్డు ప్రదానం చేశారు. ప్రముఖ సినీ నటులు మురళీమోహన్, సుమన్, సాయికుమార్, దర్శకుడు అనిల్ రావిపూడి శ్రీధర్‌ను అభినందించారు. మూడు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ కళాకారులు, రచయితలను ప్రోత్సహిస్తూ వేదికలు కల్పించిన నీలా శ్రీధర్ అభినందనీయుడని వారన్నారు.


నాలాలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ యాకర అమృత

నాలాల్లో పూడికతీతకు చర్యలు తీసుకోండి

నల్లకుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): నాలాల్లో పూడిక తీయించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. శుక్రవారం గాంధీనగర్, లంక ప్రాంతాల్లో నాలాలో పీడికతీత పనులను ఆమె పరిశీలించారు. నాలాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం, మొక్కలు, వ్యర్థాలతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ పృథ్వీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయండి

ముషీరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): షేర్ అలీ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ సూచించారు. శుక్రవారం రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, పార్టీ నాయకులు జమాల్‌పురి నందు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్

'పది' ఫలితాల్లో 'రేడియంట్' విద్యార్థుల ప్రతిభ

ముషీరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రేడియెంట్ హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. 44మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. సలోని కుమారి మిశ్రా 547 మార్కులు సాధించారు. మదియా అఫ్రాన్, బుష్రానజీరీన్, రత్నపూరి అనుపమ్, శేక్ ఫరాన్, సాదిదా కషఫ్, హజిరా ఫాతీమా తదితర విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ ఖలీల్ అన్వర్, మంజుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న అరవింద్‌కుమార్

చిక్కడపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ వివేక్‌నగర్ బస్తీలో తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, ముషీరాబాద్ ఎ-బ్లాక్ అధ్యక్షుడు వీడీ నర్సింహ, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు శీలం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా

రఘురామ్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం

చిక్కడపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): లేబర్‌కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె. రఘురామ్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించారు. 2025-2026 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రఘురామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం. మధుసూదన్, ఉపాధ్యక్షులుగా డి. విలాస్, కోశాధికారిగా ఎం. కిరణ్‌కుమార్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా రవియా బేగం ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు నిర్మల్‌కుమార్ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యులు జి. రామారావు, ఫణీంద్ర భార్గవ్ శుక్రవారం ప్రకటించారు.

శిథిలావస్థలో హౌసింగ్‌బోర్డు ఫ్లాట్లు

- నివాసితుల ఆందోళన
- పలుమార్లు భవనం గోడలు కూలిన సంఘటనలు
- పలువురికి గాయాలు
- పట్టించుకోని అధికారులు

గోల్నాక, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్మించిన క్వార్టర్స్‌లో నివసిస్తున్న పేదలు ఆందోళన చెందుతున్నారు. క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. గోల్నాక డివిజన్ నింబోలి అడ్డ టక్కీజైలు పక్కన గల సంజయ్‌గాంధీనగర్‌లో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పేదల కోసం 1998 డిసెంబర్‌లో 54 ఫ్లాట్లను నిర్మించారు. అప్పటి కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఫ్లాట్లలో 54 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఫ్లాట్లు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేయించాలని నివాసితులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోడలు పలుమార్లు కూలి కొందరు గాయపడిన సంఘటనలు ఉన్నాయన్నారు. గత నెల 1న భవనం రెండో అంతస్థు రెయిలింగ్ కూలి పక్కనున్న ఇంటిపై పడడంతో రేకులు ధ్వంసమై ముగ్గురు గాయపడ్డారు. అధికారులు, నాయకులు వచ్చి చూసి వెళ్లారే తప్ప పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి క్వార్టర్స్‌ను పరిశీలించారు. శిథిలావస్థకు చేరాయని, ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారని, దానిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియడం లేదని స్థానికులు అంటున్నారు. క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయాలని నివాసితులు కోరుతున్నారు.

కొత్తవి నిర్మించాలి



శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌ను కూల్చివేసి కొత్తవి నిర్మించి పేదలకు అందజేయాలి. మరలా ప్రమాదాలు జరగకముందే అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలి.

- దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేటర్


శిథిలావస్థలో ఉన్న భవనం

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన

డాక్టర్ శంకరన్ ప్రజా ఆస్పత్రిపై చర్యలు తీసుకోండి

- జీహెచ్ఎంసీ అధికారులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశం


ప్రజా ఆస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిర్మించిన డాక్టర్ శంకరన్ ప్రజా ఆస్పత్రిపై 15 రోజుల్లో చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ జోనల్ అధికారులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. ఈ విషయంలో మీరు స్పందించకపోతే హైడ్రా యాక్షన్ ప్లాన్ చేపడుతుందని హెచ్చరించారు. జీ ప్లస్ నాలుగు అంతస్థులకు అనుమతి తీసుకొని అదనంగా మరో రెండు అంతస్థులు నిర్మించడంతోపాటు సెట్‌బ్యాక్‌లు వదిలిపెట్టలేదని, గృహ నిర్మాణ అనుమతి పొంది 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశారని తెలిపారు. ఫైర్ సేఫ్టీ లేదని, రోడ్డును ఆక్రమించారని పట్టాబి టవర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, మాజీ ప్రధాన కార్యదర్శి గుణశేఖర్, సంధ్య 35 థియేటర్ యజమానులు రమేష్, మహదేవ్ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రంగనాథ్ ఆస్పత్రి భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. నిబంధనలు పాటించకుండా ఆస్పత్రిని ఎలా నిర్మించారని డాక్టర్ శంకర్‌ను నిలదీశారు. నిబంధనలు పాటించకుండా నిర్మించిన భవనంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని జీహెచ్ఎంసీ అధికారులను మందలించారు. 300 కుటుంబాలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న ఆస్పత్రి భవనంపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి


హైకోర్టు తీర్పు పత్రాలను చూపిస్తున్న బీసీ సంఘాల నేతలు

బర్కత్‌పుర, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, క్రీమీలేయర్‌ను రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రా సత్యనారాయణ డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ స్థానిక సంస్థలలో 52 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎర్రా సత్యనారాయణ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై తాము హైకోర్టులో పిటీషన్ వేశామని, కోర్టు తీర్పు మేరకే రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టిందని ఆయన గుర్తు చేశారు. ఢిల్లీలో సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించిన ఫలితంగానే కులగణనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులగణన ద్వారానే బీసీలకు సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు కోల జనార్దన్, వేముల రామకృష్ణ, సుధాకర్ ముదిరాజ్, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు చేస్తేనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం


ధర్నా చౌక్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న హాష్మి, బసవపున్నయ్య, చంద్రశేఖర్ తదితరులు

కవాడిగూడ, మే 2 (ఆంధ్రజ్యోతి): మేడే స్ఫూర్తితో జర్నలిస్టుల సమస్యలపై సంఘటితంగా పోరాటాలు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఎస్ హాష్మి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలవల్ల జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు.

శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజే), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో మే డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హాష్మి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జర్నలిస్టులు సంఘటితంగా పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఇ. చంద్రశేఖర్ మాట్లాడుతూ మేడే సందర్భంగా కార్మికులకు సాధారణ సెలవు ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు.

హెచ్‌యూజే కార్యదర్శి బి. జగదీశ్వర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌కే సలీమా, కె. నిరంజన్, బి. దామోదర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ మధుకర్, పి. విజయ, హెచ్‌యూజే ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత వివాహ పరిచయ వేదిక

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): జియో మ్యాట్రిమోని ఆధ్వర్యంలో ఈ నెల 3న సికింద్రాబాద్ అమృతవాణి సెంటర్‌లో ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఈవో అబ్రహాం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివాహ పరిచయ వేదిక ఉంటుందన్నారు. వివరాలకు 8885073555, 8885428555 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

12న కామ్రేడ్ ఓంకార్ శతజయంతి ఉత్సవ సభ

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ ఓంకార్ శతజయంతి ఉత్సవ సభ ఈ నెల 12వ తేదీన సాయంత్రం 4 గంటలకు వరంగల్ జిల్లా మచ్చాపూర్ వద్ద నిర్వహిస్తున్నామని ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఓంకార్ భవన్‌లో శత జయంతి సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గాల

పరిశీలకుల నియామకం

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలకులను తెలుగుదేశం పార్టీ నియమించింది. ముషీరాబాద్ నియోజకవర్గం పరిశీలకులుగా కె.పరుశురామ్, పి.వీరబాబు, అంబర్‌పేటకు పి.బాల్‌రాజ్‌గౌడ్, లాయక్, ఖైరతాబాద్‌కు రాజేంద్ర ప్రసాద్, మల్లికార్జున్, జూబ్లీహిల్స్‌కు ఎంకే బోస్, సి.విఠల్, సనత్‌నగర్‌కు నల్లెల కిషోర్, మేడిపల్లి శ్యామ్‌సుందర్, నాంపల్లికి ఎం.రాజు, సత్యనారాయణ, సికింద్రాబాద్ నియోజకవర్గం పరిశీలకులుగా జాకబ్, ఎ.బి.ఆర్.మోహన్‌రావును నియమించింది.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 20న నిర్వహించే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పలువురు వక్తలు కోరారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు బి.వెంకట్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

అత్యంత వెనుకబడిన బేడ, బుడగ జంగాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బేడ బుడగ(జంగం) హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు గగనం మంతప్ప, సమితి వ్యవస్థాపక చైర్మన్ గగనం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేడ, బుడగ జంగాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు.

తీజ్ పండగను ఘనంగా నిర్వహించాలి

తెలంగాణ బంజారా జాగృతి ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో బంజారాల తీజ్ పండగను ఘనంగా నిర్వహించాలని, ఇందుకు సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. తెలంగాణ బంజార జాగృతి ఎస్టీ విభాగం నాయకులు కల్యాణ్‌నాయక్, రూప్‌సింగ్, హరిసింగ్ తదితరులు శుక్రవారం కవితను కలిసి తీజ్ ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.


ముషీరాబాద్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, కార్పొరేటర్లు


బాగ్‌లింగంపల్లిలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ కె. రవిచారి తదితరులు

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం

ముషీరాబాద్/రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలని ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న కులగణన నిర్ణయం చరిత్రాత్మకమైనదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు అన్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో మోదీ చిత్రపటాలకు బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

ట్రంప్ విధానాలు ప్రపంచ శాంతికి తోడ్పడవు

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న విధానాలు ప్రపంచ శాంతికి తోడ్పడవని మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ అన్నారు. అమెరికా అగ్రరాజ్యంగా కొనసాగడానికే నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ రాంరెడ్డి వర్ధంతిని యూటీఎఫ్ అధ్యక్షుడు చావ రవి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగేశ్వర్ మాట్లాడుతూ ట్రంప్ చర్యలు ఇదే విధంగా కొనసాగితే డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీ ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. రాంరెడ్డి సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఐ.వెంకటేశ్వరరావు, నాయకులు సంయుక్త, కృష్ణమూర్తి, జంగయ్య, లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బాస్కెట్‌బాల్ పోటీల్లో సైనిక్‌పురి జట్టు శుభారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎల్.వెంకట్రామ రెడ్డి స్మారక బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సైనిక్‌పురి జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్ (వీపీజీ)లో పోటీలను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో సైనిక్‌పురి జట్టు 22-15, 36-33తో వీపీజీ టీమ్‌పై గెలిచింది. సైనిక్‌పురి ఆటగాడు మోనిష్ 16 పాయింట్లతో ఆ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. పోటీల ప్రారంభోత్సవంలో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అధ్యక్షుడు రావుల శ్రీధర్ రెడ్డి, టెక్నో పెయింట్స్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్ర వల్లే కులగణనకు కేంద్రం నిర్ణయం

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర వల్లే కులగణనకు కేంద్రం నిర్ణయం తీసుకుందని రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలోపు కులగణన పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణనను బీజేపీ నేతలు తప్పుబట్టడాన్ని అనిల్‌కుమార్ తీవ్రంగా ఖండించారు.

కులగణన అమలుకు కృషి చేసిన సీఎంకు కృతజ్ఞతలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు, కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి పార్లమెంట్‌లో చట్టం చేయాలని చిత్తశుద్ధితో కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, రాహుల్‌గాంధీకి తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ ఆయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టె విజయకుమార్‌గౌడ్, బీసీ సమైక్య అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, సింగం నరేష్‌గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ఒత్తిడి వల్లే..

నల్లకుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన జరగాలనే యోచనతో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని, ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేయాలని నిర్ణయం తీసుకుందని టీపీసీసీ కార్యదర్శి ఎన్. అజయ్‌కుమార్, ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, సలహాదారు ఎన్. శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం హైదర్‌గూడలో విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి తెచ్చిన ఘనత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు.

రాంనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

నల్లకుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ స్ట్రీట్ నంబర్ 18లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ దళిత సేన మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం హైదర్‌గూడలో ఆమె మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అన్ని వర్గాల ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మే 2 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. ఉందానగర్ - జూకల్ రైల్వే స్టేషన్‌ల మధ్య 45ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
అంజిరెడ్డి : 99859 21362